క్లుప్తంగా

ఆధ్యాత్మిక సేవలపై తగ్గిన పన్నుభారం



నందిగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో ఆధ్యాత్మిక సేవలపై కూడా పన్ను భారం తగ్గుతుందని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని పల్లగిరి గట్టుపై ఉన్న పర్యాటక ఆదిత్య రంగాలలో జీఎస్టీ నూతన విధానంపై గురువారం ఆయన అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో కేంద్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుందని తెలిపారు. నూతన విధానంతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు కలుగుతుందని జీఎస్టీ నూతన విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు, ఏఈ ఫణిశ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవనం చుట్టూ ప్రహరీ, ఎరువుల బ్యాగులు భద్రపరచటానికి గోడౌన్, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని సంఘ అధ్యక్షుడు పొందూరు శ్రీనివాసరావు గురువారం కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాంకు వినతిపత్రం అందజేశారు. సొసైటీ మిగులు బడ్జెట్ ద్వారా పనుల నిర్వహణకు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సీఈఓ మునగ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పూజా సామగ్రి అందజేత



నందిగామ రూరల్: మండలంలోని గోళ్లమూడి గ్రామంలో పార్వతీ సమేత శంభులింగేశ్వరస్వామి వారికి ఆలయ చైర్మన్ చావా అర్జునరావు దంపతుల సౌజన్యంతో నూతన వెండి చామర, శంకు, రుద్రాక్షమాల, పాంచజన్యం, పూజా సామగ్రిని స్వామి వారికి గురువారం అందజేశారు. ఆలయ అర్చకుడు సంప్రోక్షణ అనంతరం స్వామి వారి సేవలకు వినియోగించారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కంచికచర్ల: ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని, లేకపోతే ఏదైనా ప్రమాదం జరిగితే విలువైన ప్రాణాలు కోల్పోతారని ఎస్ఐ పీ విశ్వనాథ్ అన్నారు. స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్లో గురువారం వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలను నడిపే సమయంలో సంబంధిత ప్రతాలు అందుబాటులో ఉండాలని, రాంగ్రూట్లో వాహనాలను నడపరాదని, మితిమీరిన వేగంతో వాహనాలను నడపకూడదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే, వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని చెప్పారు. ఆటోడ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా ఉండాలన్నారు. ఆటోల్లో లౌడ్ స్పీకర్లు ఉంచొద్దని చెప్పారు. అనంతరం హెల్మెట్ ధరించని 10 మందికి అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రెండు రోజుల శిక్షణ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణతో పాటు ఎనిమిది అంశాలపై ఆర్జీఎస్ఏ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నితిన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన ఎంపీపీలు, సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

ఎన్టీఆర్ ఆశయాలకు చంద్రబాబు తూట్లు

నూజివీడు: ఫెడరల్ హక్కులను హరిస్తున్న ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు భజన చేయడం ఎన్టీఆర్ ఆశయాలకు తూట్లు పొడవడమేనని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్రం ప్రభుత్వంపై ఆనాడు ఎన్టీఆర్ గర్జిస్తే, చంద్రబాబు నేడు కేంద్ర ప్రభుత్వానికి జీ హుజూర్ అంటూ మతోన్మాద ఫాసిస్టు శక్తులకు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రాల ఆదాయాలను కొల్లగొడుతున్న జీఎస్టీని ప్రతిపక్షంలో ఉండగా విమర్శించిన చంద్రబాబు, నేడు కొద్దిపాటి సవరణలను అతిగా కీర్తించటం చంద్రబాబు రెండు నాలుకల ధోరణికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధి ప్యాకేజీలు ఇవ్వకుండా మోసం చేస్తున్న మోదీని కర్నూలుకు తెచ్చి అక్కడ ప్రజల విశ్వాసాన్ని చంద్రబాబు కోల్పోయారని హరినాథ్ అన్నారు.

అనుయాయుల కోసమే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

పట్టణ విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్సార్ సీపీ ఇన్చార్జి తన్నీరు



పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో తన్నీరు, చిన్నా తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో పేదలకు మెడికల్ విద్యను, మెరుగైన వైద్యాన్ని అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి రాష్ట్రంలో 100 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 17 మెడికల్ కాలేజీలు తీసుకువస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకు కావాల్సిన వారికి కట్టబెట్టేందుకు ప్రైవేటు పరం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. గురువారం సాయంత్రం జగ్గయ్యపేట పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్ఖాన్ అధ్యక్షతన జగ్గయ్యపేట పట్టణ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తన్నీరు నాగేశ్వరరావు ప్రారంభించారు. తన్నీరు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. చంద్రబాబునాయుడు తన అనుయాయులకు ప్రైవేటు కాలేజీలను కట్టబెట్టేందుకు అన్ని నిబంధనలకు నీళ్లొదులుతున్నారని విమర్శించారు. సింగిల్ టెండర్ విధానాన్ని కూడా అంగీకరించేందుకు తెగబడటం దారుణం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అ కూటమి ప్రభుత్వ చర్యలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలన్నారు. పేదలకు మెడికల్ విద్యను అందించేందుకు వైఎస్ జగన్మోహన్రెడ్డి చేసిన ప్రయత్నాలను పూర్తిగా నేడు నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 5 మెడికల్ కాలేజీలను పూర్తిచేసి తరగతులను కూడా ప్రారంభించామని, మరో 2 కాలేజీల నిర్మాణం పూర్తయిందని గుర్తుచేశారు. ప్రభుత్వ రంగంలో నిర్వహించాల్సిన కాలేజీలను గంపగుత్తంగా ప్రైవేటువారికి అప్పగించడం వల్ల పేద ప్రజలు దారుణంగా నష్టపోతారని తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్, పార్టీరాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్నా), రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి సత్యశ్రీనివాసరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నంటూరి రవి, పేట మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు, రాష్ట్ర ఎస్సీసెల్ నాయకుడు ఉప్పెల్లి పెంటయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి జుబేర్, ఇంకా నియోజకవర్గ, మండల, పట్టణ, గ్రామ, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నేడు కృష్ణమాదిగ రాక

జగ్గయ్యపేట అర్బన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ శుక్రవారం జగ్గయ్యపేట పట్టణానికి రానున్నారని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి చింతిరాల గోపి మాదిగ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయిపై జరిగిన దాడియత్నాన్ని ఖండిస్తూ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న భారత మాజీ ఉప ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్రామ్ విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ పాల్గొంటారన్నారు. ఎమ్మార్పీ ఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ నాయకులు, ప్రజాస్వామిక వాదులు పాల్గొనాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలో కాపు సామాజికవర్గానికి రక్షణ కరువు

వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్ మనోహర్

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో కాపు సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వంలో న్యాయం జరగడం లేదని, రక్షణ కరువైందని వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ ఆరోపించారు. గురువారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కందుకూరు నియోజకవర్గం, గుడ్లూరు మండలం, రాళ్లపాడు గ్రామ పరిధిలోని కాపు కుటుంబం తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు, తిరుమలశెట్టి భార్గవ నాయుడు, తిరుమలశెట్టి పవన్ నాయుడుపై పార్చునర్ కారుతో కాకర్ల హరిశ్చంద్రప్రసాద్ తన అనుచరులతో కలిసి బైకు మీద వెళుతున్న ముగ్గురు అన్నదమ్ములను ఢీకొట్టి, పదేపదే వారిపైకి కారు ఎక్కించారని తెలిపారు. ఈ సంఘటనలో తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడి ప్రస్తుతం గుంటూరు ఉదయ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారిద్దరి పరిస్థి తి విషమంగా ఉందన్నారు. హత్య, హత్యాయత్నం అత్యంత దారుణమైన సంఘటన అన్నారు. దీనికి ప్రభు త్వం పూర్తి బాధ్యత వహించి బాధితులకు రక్షణ కల్పించాలని, ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల కాపు సామాజికవర్గం ఆధ్వర్యంలో 'చలో కందుకూరు' కార్యక్రమం నిర్వహించి నిరసన తెలియజేస్తామన్నారు. కుల అహంకారంతో, ప్రభుత్వ పెద్దల సహకారంతో ఈ హత్య జరిగినట్టు రాష్ట్రంలోని కాపు కుటుంబ సభ్యులు అందరూ భావిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమ సామాజిక వర్గానికి చెందిన నేత కాబట్టి కాకర్ల హరిశ్చంద్రప్రసాద్ను ఇప్పటి వరకు అరెస్ట్ చేయలేదని, డెప్యూటీ సీఎం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్యం దుకాణాల తనిఖీ

చందర్లపాడు(నందిగామ టౌన్): మద్యం దుకాణాలలో నాణ్యమైన మద్యం విక్రయించాలని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రమాదేవి పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని మద్యం దుకాణాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ముందుగా దుకాణాలలోని మద్యం సీసాలను సురక్ష యాప్ ద్వారా క్యూఆర్ కోడ్, బ్యాచ్ నంబర్ల ఆధారంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం దుకాణాలను నిర్వహించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన మద్యాన్ని అందించటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం



మైలవరం: అందరికీ ఆహారం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీపురంశెట్టి రంగారావు అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆకలి చావులు సంభవించకుండా అందరికీ ఆహారం కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. వ్యక్తిగతంగా అందరూ ఆహారాన్ని వృథా చేయకుండా ఆకలితో ఉన్న వారికి అందించడంలో ముందుండాలని సూచించారు. వివాహాలు, పండుగలు, విందులు, వినోదాల సమయంలో ఆహారం వృథా అవుతోందని, దానిని నివారించడంలో విద్యార్థులు ముందుండాలన్నారు. అధ్యాపకులు డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి



పేట ప్రభుత్వాస్పత్రిలో సీపీఆర్పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



కొణకంచిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వాణి

జగ్గయ్యపేట అర్బన్: ప్రతి వ్యక్తీ సీపీఆర్పై అవగాహన కలిగి ఉండాలని జగ్గయ్యపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్(ప్రభుత్వాస్పత్రి) సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ అన్నారు. సీపీఆర్ అవగాహన వారోత్సవం గురువారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ హరికృష్ణ మాట్లాడుతూ ప్రజల్లో సీపీఆర్ ప్రాముఖ్యత, దశలు, సరైన పద్ధతులు తెలియజేయడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యం అన్నారు. హృదయం శక్తి ఆగిపోయినప్పుడు తక్షణం ఇవ్వబడే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిస్యూటేషన్) గుండెపై కొద్దిసేపు ఒక పద్ధతి ప్రకారం నొక్కడం అనేది ప్రాణాలను కాపాడగల అత్యవసర చికిత్సా విధానం అన్నారు. సాధారణ ప్రజలు సరైన జ్ఞానం ద్వారా ఈ పద్ధతి ఉపయోగించి ఎంతో మంది ప్రాణాలను రక్షించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు హరీష్, రాజేశ్వరి, రాజ్కుమార్, జ్యోత్స్న, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొణకంచి(పెనుగంచిప్రోలు): సీపీఆర్ ద్వారా అపస్మారక స్థితిలో ఉన్న రోగిని ముందస్తు ప్రాథమిక అత్యవసర చికిత్సగా ప్రాణాపాయం నుంచి రక్షించటానికి ఉపయోగపడుతుందని స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి కె.వాణి అన్నారు. గురువారం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో సీపీఆర్పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛాతిపై నిముషానికి 100–120 వరకు 5 సెంమీ లోతు వరకు అరచేతితో కుదింపులు చేయుట వలన గుండె నుంచి రక్త సరఫరా మొదడు ఇతర భాగాలకు అంది శ్వాస తీసుకోవటం జరుగుతుందన్నారు. వెంటనే రోగిని అంబులెన్స్లో ఆసుపత్రికి తరలించి నిపుణులతో చికిత్స అందించవచ్చన్నారు. పాఠశాల హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

ఎంపీపీ కొలుసు రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొలుసు రమాదేవి, ఎంపీడీవో నితిన్ తదితరులు

వత్సవాయి: గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీపీ కొలుసు రమాదేవి సూచించారు. గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అధికారులు తమశాఖల పనితీరును వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో జ్వరాలు వస్తున్నాయని, ఇందుకు పారిశుధ్యం సక్రమంగా లేకపోవడమేనన్నారు. గ్రామాల్లో హోటల్ నిర్వాహకులు చికెన్షాపులు, కొబ్బరి బోండాలు అమ్మే వాళ్లు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామానికి దూరంగా వేసి వ్యర్థాలను కాల్చివేసేలా వారికి సూచన చేయాలన్నారు. రైతులు తమ భూ సమస్యలపై వస్తున్న అర్జీలను రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కారం చూపడంలేదని కొందరు సర్పంచులు సమావేశంలో చర్చించగా సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని డీటీ కే ప్రభుకుమార్ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఈకేవైసీ గ్రామాలవారీగా సభలు నిర్వహించి అందరికీ ఈకేవైసీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భీమవరం, గోపినేనిపాలెం రహదారులకు మరమ్మతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, ఎంపీడీవో నితిన్, ఏవో ఎస్. రాంబాబు, సర్పంచులు భూక్యా సీతమ్మ, కొట్టె నగేష్, వడ్డే పరమయ్య, లేళ్ల హరికృష్ణారెడ్డి, బొల్లం నారాయణప్రసాద్, ఎంఈవో ఎల్ నాగరాజు, పలు గ్రామాల కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



కరపత్రాలు ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

నందిగామ రూరల్: విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు ఒకే క్యాడర్ ఒకే వేతనంతో పాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ కోరారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై యునైటెడ్ ఎలక్ట్రికల్ సిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న సమ్మెకు సంబంధించిన కరపత్రాలను చందాపురం గ్రామంలోని విద్యుత్ సబ్స్టేషన్లో గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 18 నుంచి సమ్మెబాట పడుతున్నామన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్లో పని చేస్తున్న నాన్ రెగ్యులర్ ఉద్యోగులందరికి రూ. కోటి ఇన్సూరెన్స్ కల్పించటంతో పాటు రూ. 10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని తెలిపారు. అంతే కాకుండా రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్ డీఏను వెంటనే విడుదల చేయటంతో పాటు కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్, కిషోర్, గాంధీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



పల్లగిరి ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నందిగామ రూరల్: మండలంలోని పల్లగిరి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను ఎంపీడీవో ఆర్వీఎస్ ప్రసాదరావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులకు సులభ రీతిలో అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలని ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. పాఠశాల పరిసరాలను, వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆధార్ అప్డేట్ చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని పరిశీలించి సర్వే, వర్క్ఫ్రం హోం, బయోమెట్రిక్ అథెంటికేషన్, ఈకేవైసీ, అభివృద్ధి పనులు, తదితరాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం

మున్సిపల్ కమిషనర్కు సమ్మె నోటీసు అందజేసిన కార్మిక సంఘాల నేతలు



మున్సిపల్ కమిషనర్కు సమ్మె నోటీసును అందజేస్తున్న సీపీఐ, కార్మిక సంఘాల నేతలు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని స్థానిక సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే నవంబర్ 3వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామని తెలియజేస్తూ మున్సిపల్ కమిషనర్ను కలిసి సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచినప్పటికీ కార్మికుల సమస్యలను ఏమాత్రం పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే నవంబర్ 2వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని, వీటికి కూడా ప్రభుత్వం స్పందించకపోతే నవంబర్ 3 వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజీ శివాజీ, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి పోతిపాక వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్మికులు కుడుముల విజయ్కుమార్, కొత్తపల్లి బుజ్జి, బుర్రి మస్తాన్ పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ విజయకుమార్

కంచికచర్ల: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 17న మండలంలోని ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించటం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి కే విజయకుమార్ తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో మండల స్థాయి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై గురువారం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో పరిటాల, కంచికచర్ల, పెండ్యాల, చెవిటికల్లు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటవుతాయని పేర్కొన్నారు. తేమ 17 శాతం ఉండేలా ఆరబెట్టుకోవాలని, గోనె సంచులు, హమాలీలు, రవాణ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. సాధారణ రకం (కామన్) ధాన్యం 100 కేజీలు రూ.2,369, గ్రేడ్ ఏ రకం 100 కేజీలు రూ.2,389లకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. వీఏఏలు, పీఏసీఎస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం రవాణాకు ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలి

విజయవాడ సబ్ కలెక్టర్ చైతన్య

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): ఖరీఫ్ ధాన్యాన్ని మిల్లర్లకు రవాణా చేసేందుకు స్థానిక రైతులు ట్రాక్టర్లను ఏర్పాటు చేయాలని విజయవాడ సబ్ కలెక్టర్ కావూరి చైతన్య విజ్ఞప్తి చేశారు. కొత్తూరు తాడేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్లున్న రైతులు సొంత ఖర్చులతో జీపీఎస్ సిస్టమ్ను ఏర్పాటు చేసుకుని ధాన్యం పొలాల నుంచి రైస్ మిల్లులకు రవాణా చేసుకోవాలన్నారు. రవాణా చార్జీలను ప్రభుత్వం చెల్లిస్తుందని,గోనె సంచులను ప్రభుత్వం సరఫరా చేస్తుందని, తేమ శాతం కొలిచే బాధ్యతలను రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించే దానిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. సమావేశంలో సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, తహసీల్దార్ బి.సుగుణ, మండల వ్యవసాయాధికారి కె.రఘురాం, వీఆర్వో చక్రధరరావు, రైతులు, సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతిగృహం సందర్శన

జి.కొండూరు: స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ ఆర్.రామ్మోహన్రావు గురువారం సందర్శించారు. ఎస్సీ వసతిగృహానికి ప్రత్యేక అధికారిగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు భారతదేశం మ్యాప్లు, స్వీట్లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, వసతిగృహం వార్డెన్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram finance ltd. జగ్గయ్యపేట బ్రాంచి వారి [illegible] ... S/o. వెంకటేశ్వర్లు, ఎన్.టి.ఆర్. జిల్లా, వత్సవాయి మండలం [illegible]
[illegible] S.R. No. 18[illegible] [illegible]
జగ్గయ్యపేట — రాయపూడి శ్రీనివాసరావు
తేది: 16-10-2025 — అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 19620

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram finance ltd. జగ్గయ్యపేట బ్రాంచి వారి [illegible] గోపాలరావు S/o. వెంకటేశ్వర్లు, ఎన్.టి.ఆర్. జిల్లా, పెనుగంచిప్రోలు మండలం [illegible]
[illegible]
జగ్గయ్యపేట — రాయపూడి శ్రీనివాసరావు
తేది: 16-10-2025 — అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 19620

గర్భిణులకు పోషకాహారంపై అవగాహన



గర్భిణులు, బాలింతలతో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీఓ రూపవతి

వీరులపాడు(కంచికచర్ల): ప్రతి మహిళ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకునేలా అవగాహన కల్పించాలని ఎంపీపీ కోటేరు శ్రీలక్ష్మి అన్నారు. మండలకేంద్రమైన వీరులపాడులో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం కార్యక్రమం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని సక్రమంగా అందించాలన్నారు. టాటా ట్రస్టు విజయవాడ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు మహిళలకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ రూపవతి, ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రభావతి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

జూపూడి(ఇబ్రహీంపట్నం): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యువ భారత్.. మై భారత్ నినాదంతో స్థానిక నిమ్రా కళాశాలలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ గురువారం నిర్వహించారు. కళాశాలలో బాయ్స్ క్యాటగిరీలో వాలీబాల్, షాట్ పుట్, రన్నింగ్, ఉమెన్స్ కేటగిరీలో కబాడీ, రన్నింగ్, షార్ట్పుట్ క్రీడలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ టి.నారాయణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ అక్బర్ఖాన్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. పీడీ డాక్టర్ ఎండీ సత్తార్ ఖాన్ పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహనా ర్యాలీ



నూజివీడు: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులను కుదించడంతో వాహనాల ధరలు గణనీయంగా తగ్గాయని నూజివీడు మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ బాలెందు శేఖర్ అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బస్టాండ్ నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వరకు ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, యజమానులతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో వాహనాల కొనుగోలుదారులకు సైతం వెసులుబాటు కలిగిందన్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల ధరలు పెద్దఎత్తున తగ్గాయని చెప్పారు. జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ టీవీ కృష్ణవేణి, కార్యాలయ సిబ్బంది, ఆటోవాలాలు, టాక్సీ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.